# అభద్రతలో... అంతర్గత భద్రత..

**"భారతదేశం తన సరిహద్దుల వద్ద కంటే... దేశం లోపలే అత్యంత ప్రమాదకర స్థితిని ఎదుర్కొంటోంది. అంతర్గత భద్రత భారత్ ముందున్న అతిపెద్ద సవాల్. ఇది ఏ ఒక్క రాష్ట్రానికో పరిమితమైంది కాదు. 'హైడ్రా'లా అనేక తలలు కలిగి... దేశంలో అంతర్గత శాంతికి భంగం కలిగించేందుకు అకస్మాత్తుగా విరుచుకుపడే తీవ్ర సమస్య ఇది. దేశ అంతర్గత భద్రతను సవాలు చేసే ఉగ్రవాదులు... ఆధునిక పరిజ్ఞానం, అత్యాధునిక ఆయుధాలతో ఏ క్షణమైనా శాంతి భద్రతలను విచ్ఛిన్నంచేసే ప్రమాదం పొంచి ఉంది. మన పోలీసు దళాలు, సాయుధ దళాలు అంతకుమించిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో... ఎలాంటి దాడులనైనా తిప్పికొట్టగలిగే వ్యూహాన్ని తయారుచేయగల నేర్పరితనాన్ని కలిగి ఉండాలి!!**

ముంబయిలో ఉగ్రవాదుల దాడిని సమర్థవంతంగా తిప్పి కొట్టగలిగినా.. ప్రధానమంత్రి మాటలను మరింత సీరియస్‌గా తీసుకొని.. ఇంటెలిజెన్స్ వ్యవస్థను పటిష్ఠం చేసుకొని.. దాడులు జరగబోయే విషయాన్ని పసిగట్టి ఉంటే, ఈ విషాదాన్ని నిరోధించగలిగి ఉండేవారమా?! అనే ప్రశ్న, ప్రతి పౌరుడ్ని ఎంతో ఆక్రోశానికి గురి చేస్తోంది. దాడి ప్రారంభమైన తర్వాత స్థానిక పోలీసు అధికారులు, సైనిక దళాలు, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్‌కు చెందిన అధికారులు వీరోచితంగా పోరాడి.. ఎంతో మందిని రక్షించారు. ఆ ప్రయత్నంలో తమ సహచరులు కొంతమంది ప్రాణాలు కోల్పోయినా.. వారు నిబ్బరంగా పోరాడిన తీరు చూస్తే... నైపుణ్యంలో, ధైర్య సాహసాల్లో మన దళాలు ప్రపంచంలో మరే దేశానికి తీసిపోవనే నమ్మకం ప్రజల్లో ఏర్పడింది. వివిధ దళాల మధ్య సమన్వయం.. నిఘా వ్యవస్థకు సంబంధించిన సమాచార సేకరణ.. త్రివిధ దళాల మధ్య, ఆయా రాష్ట్రాల్లో పోలీసుల మధ్య సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం.. జాతీయ స్థాయిలోనే కాకుండా, రాష్ట్రాల స్థాయిలో కూడా నిఘా వ్యవస్థను మరింత బలో పేతం చేయటం.. వంటి విషయాలపై మరింతగా దృష్టి సారిస్తే... భవిష్యత్‌లో మరెక్కడా దాడులు జరగకుండా నిరోధించవచ్చు. తీవ్రవాద మూకలు ఇక ముందు ఇలాంటి దుస్సాహసం చేయకుండా ఉండాలంటే.. అంతర్గత భద్రతా వ్యవస్థను క్షుణ్ణంగా సమీక్షించి, తక్షణం బలోపేతం చేయాల్సిన అవసరముంది.

### అంతర్గత భద్రత అంటే:

భద్రత పరంగా దేశ రక్షణకు ఎదురయ్యే సవాళ్లు రెండు రకాలు. ఒకటి పొరుగున ఉన్న దేశాల నుంచి కానీ, మరేదైనా దేశం నుంచి కానీ, భారత్‌పై దాడి జరిగే అవకాశముండటం. ఇది దేశం వెలుపల నుంచి ఎదురయ్యే సమస్య. దీన్ని ఎదుర్కోవడానికి సైన్యం, వైమానిక దళం, నావికా దళాలతో కూడిన త్రివిధ దళాలున్నాయి. త్రివిధ దళాలు దేశ సరిహద్దులను అనుక్షణం కాపాడుతూ... దేశ రక్షణకు వెలుపల నుంచి ఎలాంటి సమస్య రాకుండా కాపాడుతుంటాయి. దేశ రక్షణకు రెండో సమస్య.. దేశం లోపల ఎదురయ్యేది. వివిధ రాష్ట్రాల్లో శాంతి భద్రతల సమస్యలు; జమ్మూకాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో

వేర్పాటువాద దాడులు; ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, జార్ఖండ్‌లలో నక్సలిజం; నగరాలు, పట్టణాల్లో సంభవించే సైబర్ క్రైమ్‌లు; కులం, మతం ఆధారంగా కొన్ని రాష్ట్రాల్లో పెచ్చరిల్లుతున్న హింస... దేశ అంతర్గత భద్రతకు తూట్లు పొడిచే ప్రధాన సమస్యలు. వీటిని తుదముట్టించడం అంత తేలిక కాదు. ఈ అంశాలన్నింటిపైనా సమర్థమైన వ్యూహంతో.. రాష్ట్రాల మధ్య.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య.. సమన్వయం సాధించి, దేశంలో అంతర్గతంగా భద్రతను పటిష్టపరచటమే... అంతర్గత భద్రత!

## భారత్‌లో ఉన్న వ్యవస్థ ఏమిటి?:

దేశంలో అంతర్గత భద్రతను నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ (జాతీయ భద్రతా సమితి) పర్యవేక్షిస్తుంది. నేషనల్ సెక్యూరిటీ కౌన్సి ల్.. రక్షణ శాఖ, హోం శాఖలతో సమన్వయం చేసుకుంటూ... దేశ భద్రతకు సంబంధించి ఎప్పటికప్పుడు సలహాలు ఇస్తుంది. ఇది మూడంచెల వ్యవస్థ. ఇందులో జాతీయ భద్రతా సలహాదారు, రక్షణ, విదేశీ వ్యవహారాలు, హోం, ఆర్థిక మంత్రులు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సభ్యులుగా ఉంటారు. దీనికి ప్రధానమంత్రి అధ్యక్షత వహిస్తారు. ఈ మూడంచెల జాతీయ భద్రతా వ్యవస్థలో జాతీయ భద్రతా సలహాదారు పాత్ర ఒక సమన్వయ కర్తలాంటిది. అటు ప్రధాన మంత్రికి, కేబినెట్‌కు... ఇటు పైన పేర్కొన్న మూడంచెల వ్యవస్థల మధ్య అనుసంధానకర్తగా జాతీయ భద్రతా సలహా దారు వ్యవహరిస్తారు. జాతీయ, అంతర్జాతీయ భద్రతా విషయాలపై ప్రధానికి, కేబినెట్‌కు సూక్ష్మంగా వివరించే బాధ్యత... జాతీయ భద్రతా సలహాదారునిది. జాతీయ భద్రతకు పొంచి ఉన్న సవాళ్లను పసిగట్టడం (డిటెక్షన్), నిరోధించటం (ప్రివెన్ష న్), నిర్మూలించటం (ఎరాడికేషన్).. జాతీయ భద్రతా సమితి ఏర్పాటు వెనుక ముఖ్య ఉద్దేశం. ఈ మూడు విషయాల్లోనూ సమర్థమైన కార్యాచరణ ఉంటేనే సత్ఫలితాలు సాధ్యం! పసిగట్టే విషయానికి వస్తే... ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఎంత సమర్థంగా, సమన్వయంతో, సమాచారాన్ని సేకరించగలుగుతుందనేది అత్యంత కీలకం. విద్రోహ చర్యలు చేపట్టగలిగే సామర్థ్యం ఉన్నవారి కదలికలను అనుక్షణం గమనిస్తూ... వారి మధ్య నడుస్తున్న నెట్‌వర్క్‌ను పసిగట్టి.. ఆయా ప్రభుత్వ శాఖలకు సూచనలు అందించడం ముఖ్యం.

భారత్‌లో 1962 వరకూ.. దేశం లోపల, వెలుపల నుంచి ఎదురయ్యే, ఎదురవ్వబోయే సమస్యలపై సమాచారాన్ని అందించే బాధ్యత ఇంటెలిజెన్స్ బ్యూరోకు ఉండేది. ఇంటెలిజెన్స్ బ్యూరో అనేది బ్రిటిష్ కాలం నుంచి ఉంటూ వస్తున్న వ్యవస్థ. ముఖ్యంగా ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారులు ఇందులో బాధ్యతలు నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న శాఖల ద్వారా సూచనలను సేకరించి.. ఆ సూచనలను విశ్లేషించి, ఆయా మంత్రిత్వ శాఖలకు స్పష్టమైన సంకేతాలు ఇవ్వటం ఇంటెలిజెన్స్ ముఖ్య కర్తవ్యం. దీనికి ఎవరి ఫోన్ అయినా ట్యాప్ చేసి, విని.. సమాచారాన్ని సేకరించే అధికారం ఉంది. ఇది అనుమానితుల, సందేహాస్పద వ్యక్తుల ఫోన్లను ట్యాప్ చేయటం ద్వారా.. దేశ రక్షణకు ద్రోహం తలపెట్టగల వ్యక్తుల కదలికలను గమనిస్తుంది. తద్వారా భవిష్యత్తు ప్రమాదాలపై స్పష్టమైన

సమాచారాన్ని రహస్యంగా అందిస్తూ ఉంటుంది. 1962లో చైనా చేతిలో భారత సైనిక దళాలు ఘోరంగా దెబ్బతిన్న తర్వాత... దేశం బయటి నుంచి పొంచి ఉన్న ముప్పును పసిగట్టేందుకు 'రా'ను ఏర్పాటు చేశారు. 'రా' ప్రపంచంలోని అనేక దేశాల్లో రహస్య శాఖలను కలిగి ఉంటుంది. వీటి సహాయంతో.. ఆయా దేశాల నుంచి భారతదేశ భద్రతకు సంబంధించి ఎదురయ్యే సవాళ్లను పసిగట్టి, స్పష్టమైన సంకేతాలు ఇస్తుంది. త్రివిధ దళాలకు సంబంధించి కూడా మిలిటరీ ఇంటెలిజెన్స్... రక్షణ పరమైన సవాళ్ల విషయంలో ముందుగానే పసిగట్టి, తగిన చర్యలు తీసుకుంటూ ఉంటుంది. దేశంలో అంతర్గత భద్రతకు సవాళ్లు.. దేశం లోపలి నుంచి అయినా, బయటి నుంచి అయినా రావచ్చు. అందువల్ల వివిధ నిఘా విభాగాల మధ్య చక్కని సమన్వయం సాధించగలిగితేనే... విద్రోహాన్ని పసిగట్టడం, నిరోధించటం సాధ్యమౌతుంది. ఉదాహరణకు ముంబయిలో జరిగిన ఉగ్రవాదుల దాడి మూలం కరాచీలో ఉందనే కథనాలు వెలువడ్డాయి. విద్రోహ మూకలు భారత నావికా దళాల కన్నుగప్పి... తీర రక్షక దళాన్ని (కోస్ట్ గార్డ్) దాటుకొని, సముద్ర మార్గం ద్వారా ముంబయికి చేరుకొని, దాడులకు తెగబడ్డాయి. కరాచీలో భారత్‌కు వ్యతిరేకంగా విద్రోహ ప్రణాళిక తయారవుతున్నప్పుడు.. దాన్ని పసిగట్టి తగిన సంకేతాలు ఇవ్వటం 'రా' కు సంబంధించిన విధి. 'రా', నావికాదళం (మిలిటరీ ఇంటెలిజెన్స్) నుంచి సమాచారం ఐబీకి చేరి... ఐబీ ద్వారా సంబంధిత అధికారులకు స్పష్టమైన సంకేతాలను ఇవ్వగలిగితే.. ఇలాంటి దాడులను పసిగట్టి, నిరోధించగలగడం సాధ్యమవుతుంది.

రాష్ట్రాల విషయానికి వస్తే... ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకమైన సమస్య అంతర్గత భద్రతను పీడిస్తూ ఉంది. రాష్ట్రాల్లో శాంతి, భద్రతలను కాపాడే పోలీసు వ్యవస్థ... నిర్భయంగా, నిష్పాక్షికంగా పని చేసే పరిస్థితులు లేవనే విమర్శ ఉంది. ఏ ప్రాంతంలో అయినా శాంతి భద్రతల పరిరక్షణ చేపట్టిన అధికారికి ఆ ప్రాంతం, ఆ ప్రాంత ప్రజలు, ఆ ప్రాంతంలో పని చేసే అధికారులు (ప్లేస్, పీపుల్, పర్సనల్)పై స్పష్టమైన అవగాహన అనివార్యం. అప్పుడే ఆ ప్రాంతంలో తలెత్తబోయే సమస్యలు.. వాటిని ముందే పసిగట్టి నిరోధించగలిగే సామర్థ్యం.. పాలనా వ్యవస్థకు చేకూరుతుంది. అనేక రాష్ట్రాల్లో అధికారులకు ఆ ప్రాంతంలో తాము ఎంతకాలం కొనసాగుతామో తెలియని పరిస్థితి. దాంతో అక్కడి భద్రతా వ్యవస్థ పనిచేసే తీరు ప్రణాళికాబద్ధంగా ఉండటంలేదు. రకరకాల ఒత్తిళ్లలో పని చేయటం.. ఒత్తిళ్లకు తలవొగ్గే స్వభావం లేకపోతే తరచూ బదిలీ ఎదుర్కోవాల్సి రావటం... నిష్పాక్షికంగా వ్యవహరించే అధికారులు, రకరకాల అనధికార శిక్షలకు గురి కావల్సిరావటం.. వంటి సమస్యలు... శాంతి, భద్రతలను కాపాడే వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపటమే కాక... వాటి మనోధైర్యాన్ని కూడా దెబ్బతీస్తున్నాయన్నది విశ్లేషకుల విమర్శ.

పాలనా యంత్రాంగం, పోలీసు వ్యవస్థల్లో తీసుకురావాల్సిన సంస్కరణలపై సుప్రీంకోర్టు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. అయినా, అవి అమలుకు నోచుకోలేదు. దీనికారణంగా భవిష్యత్తులో అధికార యంత్రాం గం నిర్వీర్యమయ్యే ఆస్కారముందని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు లేదా విద్రోహ చర్య జరిగినప్పుడు.. అప్పటికప్పుడు తాత్కాలిక

రీతిలో స్పందించి, కొన్ని చర్యలు చేపట్టటం... మళ్లీ ప్రమాదం జరిగే వరకూ, శాశ్వత నివారణా చర్యలపై దృష్టిసారించకపోవడం వల్ల ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయి. ఈ విషయంపై కార్యనిర్వాహక వ్యవస్థ, శాసనవ్యవస్థ... దార్శనిక దృష్టితో(విజన్), నిర్మాణాత్మక దృక్పథంతో తక్షణం చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. కొన్ని విద్రోహకర సంఘటనలు సంభవించినప్పుడు శాంతి భద్రతలను కాపాడటానికి ఆయా రాష్ట్రాల పోలీస్ వ్యవస్థ శక్తి సామర్థ్యాలు సరిపోనప్పుడు... రాష్ట్ర యంత్రాంగానికి మద్దతుగా ఉండి, సమస్యను దీటుగా ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం కొన్ని పారామిలిటరీ దళాలను, కేంద్ర పోలీసు బలగాలను రిజర్వ్‌లో ఉంచుతుంది. పారామిలిటరీ దళాలు రక్షణశాఖ ఆధీనంలోనూ, కేంద్ర పోలీసు బలగాలు హోంశాఖ ఆధీనంలోనూ ఉంటాయి.

### 1. స్ట్రాటజిక్ పోలీస్ గ్రూప్:

ఇందులో కేబినెట్ కార్యదర్శి, త్రివిధ దళాల అధిపతులు, రక్షణ, ఆర్థిక, విదేశీ వ్యవహారాలకు సంబంధించిన కార్యదర్శులు... సభ్యులుగా ఉంటారు. జాతీయ భద్రతను వ్యూహాత్మక దృష్టి కోణంతో పరిశీలిస్తూ... దూరదృష్టితో చేపట్టాల్సిన విధానపరమైన విషయాలపై ముసాయిదాను తయారుచేయడం దీని కర్తవ్యం.

### 2. జాయింట్ ఇంటెలిజెన్స్ కమిటీ:

ఇందులో ఇంటెలిజెన్స్ బ్యూరో, రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (ఆర్ఏడబ్ల్యూ-రా), త్రివిధ దళాలకు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజెన్స్‌లు సభ్యులుగా ఉంటాయి. ప్రమాదాన్ని పసిగట్టి నిరోధించే ముఖ్య ఉద్దేశంతో.. దేశంలోని ఇంటెలిజెన్స్ వ్యవస్థనంతటినీ సమన్వయపరచి.. వాటి నుంచి లభ్యమయ్యే ఇంటెలిజెన్స్ సూచనలను విశ్లేషించి.. జాతీయ భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు వీలుగా సూచనలు, సలహాలు ఇవ్వటం జాయింట్ ఇంటెలిజెన్స్ కమిటీ పని.

### 3. నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డ్:

భద్రతా వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై నిష్ణాతులైన నిపుణులు దేశంలో ఉన్నారు. అలాంటి నిపుణుల, విశ్లేషకుల సేవలను నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు, జాతీయ భద్రతకు ఉపయోగించుకుంటుంది. అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలు, త్రివిధ దళాలు, రక్షణ, వ్యూహా త్మక విశ్లేషణ, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక వ్యవహారాలు లాంటి విషయాల్లో నిష్ణాతులు ఇందులో సభ్యులు. ఈ బోర్డ్ కనీసం నెలకు ఒకసారి సమావేశమవుతుంది. దేశ భద్రతకు సమీప, సుదీర్ఘ భవిష్యత్తులోనూ తీసుకోవాల్సిన విధానపరమైన నిర్ణయాల్లో నిశిత విశ్లేషణను, నిర్ణయాత్మకమైన అభిప్రాయాలను జాతీయ భద్రతా సమితికి అందజేస్తుంది.

## ఇవీ పరిష్కారాలు:

దేశంలో అంతర్గత భద్రత ముందున్న సవాళ్లు స్థూలంగా... ఉగ్రవాదం, వేర్పాటువాదం, నక్సలిజం. దేశం వెలుపల నుంచి పొరుగు దేశాల ఊతం అందుకుంటున్న సీమాంతర ఉగ్రవాదం.. అనేక ప్రాంతాల్లో పెచ్చరిల్లుతున్న మత, కులోన్మాద పరిస్థితులు... అంతర్గత భద్రతకు ముప్పుగా మారాయి. వీటితోపాటు సంస్థాగతలోపాలు.. ప్రొఫెషనలిజం లోపించడం.. నిఘా విభాగాల మధ్య సమన్వయం కొరవడటం.. అమలుకు నోచుకోని పాలనా సంస్కరణలు.. భద్రతా సిబ్బందికి ప్రోత్సాహకాలు లేకపోవడం వంటివి ప్రధాన సమస్యలు. మరోవైపు త్రివిధ దళాలు, అంతర్గత భద్రతా దళాల మధ్య విభిన్న స్థాయిల్లో సమన్వయం లేకపోవడం.. విద్రోహ శక్తుల నెట్‌వర్క్‌ను ఛేదించ గలిగే సమాచారాన్ని సరైన సమయంలో సేకరించలేకపోవడం... ఏదైనా సంఘటన జరిగినప్పుడు దళాలను మోహరించడంలో వైఫల్యం.. ఘటన జరిగాక తక్షణమే పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రతి స్థాయిలోను సంక్షోభ నివారణ బృందాలు లేకపోవడం.. కూడా ముఖ్యమైన భద్రత లోపాలు.

ఈ సవాళ్లను అన్నింటినీ అధిగమించడం.. ఏ ఒక్కరోజులోనో, ఒక్క గంటలోనో, ఒక్క నిర్ణయంతోనో సాధ్యమయ్యే పని కాదు. అంతర్గత భద్రత సమస్యకు దీర్ఘకాలికంగా పరిష్కారం కోసం.. వివిధ నిఘా విభాగాల మధ్య ప్రాంతీయ, కేంద్ర, రాష్ట్ర స్థాయిలో.. సంస్థాగతపరమైన సమన్వయం పెంచాలి. నిఘా విభాగాలు సేకరించిన సమాచారాన్ని సంబంధిత భద్రతా దళాలకు అందజేసి.. వాటిపై తక్షణం చర్య తీసుకున్నారో, లేదో సమీక్షించే వ్యవస్థను సంస్థాగతం చేసుకోవాలి. వీటితోపాటు క్షేత్ర స్థాయిలో పూర్వం ప్రభావవంతంగా అమలుపరచిన బీట్ కానిస్టేబుల్ వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించాలి.

బలగాలకు నిపుణులతో ఆధునిక పద్ధతుల్లో శిక్షణ ఇప్పించాలి. దళాల ఫిట్‌నెస్‌పై దృష్టిసారించి, ఫిట్‌నెస్ పరంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలి. వీటితో పాటు వివిధ దశల్లో ప్రభావవంతంగా పని చేస్తున్న కమ్యూనిటీ పోలీసు వ్యవస్థలను.. తక్షణం అమల్లోకి తీసుకురావడం కూడా ఎంతో అవసరం. అలా చేయడం వల్ల... ప్రజలు భద్రతా సంబంధిత విషయాలపై కేవలం పోలీసులపై ఆధారపడకుండా తాము కూడా భద్రతా వ్యవస్థలో భాగమని భావిస్తారు. తమకు అందుబాటులోనున్న సమాచారాన్ని, అనుమానితులకు సంబంధించిన వివరాలను పోలీసులకు ఎప్పటికప్పుడు అందజేస్తారు. ఈ చర్యలతోపాటు వివిధ కమిటీలు ప్రతిపాదించిన పాలనా సంస్కరణలు– (స్థిరమైన ఉద్యోగం.. పనికి, పదవికి, తగిన జవాబుదారీతనం.. భద్రతాదళాలు, వారి కుటుంబాలు కనీస వసతులతో జీవించే సౌకర్యాన్ని కల్పించటం.. రాజకీయ జోక్యాన్ని పూర్తిగా తగ్గించడం.. శిక్షణకు ప్రాముఖ్యం ఇవ్వటం.. పనితీరు ఆధారంగా పదోన్నతి కల్పించటం) వంటివి అమలుపరచాలి.

ఏదైనా ఘటన జరిగిన వెంటనే స్పందించి... పక్కా ప్రణాళికతో విద్రోహ శక్తులను ఎదుర్కోవటం వంటివి... పాలనలో ప్రతి స్థాయిలోను అమలుచేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. వీటితోపాటు సామాజిక అశాంతికి దారితీస్తున్న ఆర్థిక అసమానతలను రూపుమాపే ఆర్థిక విధానాలను

రూపొందించుకోవాలి. తద్వారా నక్సలిజం, వేర్పాటువాదం వంటి వాటిని నిర్మూలించవచ్చు. భారతదేశం అనేక జాతుల, మతాల సమాహారం. ఏదైనా విద్రోహ చర్య జరిగినప్పుడు ఏదో ఒక మతంపైనో లేదా జాతిపైనో జరిగిన దాడిగా భావించకుండా... భారతీయతపైనే జరిగిన దాడిగా భావించే ఆలోచనా విధానాన్ని... దేశ ప్రజలందరిలో కలిగించాలి. అలాచేస్తే భారతజాతి స్పందించే తీరులో ఐక్యత రావటమే కాకుండా... దాడులకు పాల్పడే విద్రోహ శక్తుల మనోబలాన్ని కూడా దెబ్బతీసినట్లవుతుంది.

ప్రస్తుత పరిస్థితుల్లో కఠినమైన చట్టాలు తయారు చేయాలనే డిమాండ్ వస్తున్నా... ఉన్న చట్టాల (ఐపీసీ, సీఆర్‌పీసీ, నేషనల్ సెక్యూరిటీ యాక్ట్-1980) పరిధిలో గట్టి చర్యలు తీసుకోవడం ద్వారా అంతర్గత భద్రతను కాపాడుకోవచ్చన్నది కేంద్ర ప్రభుత్వ వాదనగా ఉంది. అయితే, కఠినమైన చట్టాల్ని తేవడం ఎంత ముఖ్యమో... అందుబాటులో ఉన్న చట్టాల్ని కఠినంగా అమలుచేయడం అంతకంటే ముఖ్యం! అప్పుడే ప్రధాని చెప్పినట్లు సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిని అమలు చేసిన వాళ్లమవుతాం!!

**మిలిటరీ, కే**

**పారా మిలిటరీ, కేంద్ర పోలీసు బలగాల్లో ముఖ్యమైనవి**

**రాష్ట్రీయ రైఫిల్స్ :**

రాష్ట్రీయ రైఫిల్స్‌ను 1990లో ఏర్పాటు చేశారు. 40 వేల మంది జవాన్లతో, 62 బెటాలియన్లు కలిగి ఉంది. తీవ్రవాదం ఎదు ర్కొంటున్న రాష్ట్రాల్లో స్థానిక భద్రతా దళాలకు ఇది తోడుగా ఉంటుంది. తీవ్రవాదం ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో సంక్షోభం తలెత్తిన ప్రతిసారీ మిలటరీ దళాలను పిలుస్తూ ఉంటే.. సరిహద్దు రక్షణ బలహీనమౌతుందనే కారణంతో రాష్ట్రీయ రైఫిల్స్‌ని ఏర్పాటు చేశారు. ఈ బలగాలు ప్రస్తుతం కాశ్మీర్లో తీవ్రవాద నిరోధక చర్యల్లో నిమగ్నమయ్యాయి.

**నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్‌ఎస్‌జీ):**

విశేష పరిస్థితుల్లో తక్షణమే స్పందించి.. నివారణ చర్యలను చేపట్టడానికి వీలుగా హోంశాఖ ఆధ్వర్యంలో 1985లో ఏర్పా టైంది. పూర్తిగా నల్లని దుస్తులు ధరించటంతో వీరిని బ్లాక్ క్యాట్ కమాండోలు అని కూడా అంటారు. ప్రస్తుతం 14,000 పైగా ఉన్న ఎన్‌ఎస్‌జీ దళం... తీవ్రవాదుల దాడులను ఎదుర్కొ వటంలో, హైజాకర్ల ఆట కట్టించటంలో, విస్ఫోటనాలని నిరోధించటంలో, తీవ్రవాదుల చెరలో చిక్కుకున్న బందీలను సురక్షితంగా విడిపించటంలో... సమర్థంగా పనిచేస్తోంది.

**అసోం రైఫిల్స్ :**

అసోం రైఫిల్స్ స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఉంది. ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్రవాద సమస్యను ఎదుర్కొవటంలో.. ఉత్తరాది రాష్ట్రాల్లో మత కలహాలు, ఘర్షణలు తలెత్తినప్పుడు.. వాటిని

అరికట్టడంలోనూ సేవలు అందిస్తుంది.

## డిఫెన్స్ సెక్యూరిటీ కార్ప్స్ (డీఎస్‌సీ) :

దాదాపు 31 వేలమంది జవాన్లతో కూడిన ఈ దళం... దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న సైనిక దళాల డిఫెన్స్ ఇన్‌స్టాలేషన్స్‌కు విద్రోహశక్తుల నుంచి ప్రమాదం వాటిల్లకుండా కాపాడు తుంటాయి.

## సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్):

200 బెటాలియన్స్ కలిగి ఉంది. ఆయా రాష్ట్రాల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తినప్పుడు.. తక్షణమే స్పందించి, శాంతి భద్రతలను నెలకొల్పే బాధ్యతలను చేపట్ట డానికి ఏర్పాటైన దళం ఇది. ఇందులో భాగంగా ఏర్పాటైన మరో దళం రాపిడ్ యాక్షన్ ఫోర్స్. మత కలహాలు పెచ్చరిల్లినప్పుడు శాంతి భద్రతలను నెలకొల్పటంలో ఈ దళం ప్రత్యేకంగా పనిచేస్తుంది.

## బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) :

1965లో ఏర్పాటైంది. బలం 2,20,000 మంది.. భారత సరిహద్దులను కాపలా కాస్తుంది. సరిహద్దుల ద్వారా జరిగే నేరాలను అరికడుతుంది. అవసరాన్ని బట్టి జమ్మూకాశ్మీర్‌లో, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో సేవలందిస్తుంది.

## రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) :

ఈ దళం బలం 45,000 మంది. భారత రైల్వే ప్రయాణికులను, ఆస్తులను కాపాడుతుంది.

## శసస్త్ర సీమ బల్ :

బలం 45,000 మంది. ఇండో నేపాల్, ఇండో భూటాన్ సరిహద్దులను కాపలా కాస్తుంది.

## సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) :

ఈ దళం బలం 1,05,000 మంది. 1983లో ఏర్పాటైంది. దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ పరిశ్రమలు, విమానాశ్రయాలు, ఓడరేవుల రక్షణ బాధ్యతలను నిర్వహిస్తుంది.

## స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ) :

1985లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం ఏర్పాటైంది. ఈ దళం బలం 3,000 మంది. దేశ ప్రధాని రక్షణ, పూర్వ ప్రధానులు; వారి కుటుంబ సభ్యుల రక్షణ బాధ్యతను నిర్వహిస్తుంది.

## స్పెషల్ ఫ్రంటియర్ ఫోర్స్ :

పర్వత ప్రాంతాల్లో.. అక్కడి పరిస్థితులకు అనుగుణంగా.. సేనలకు సహాయ సహకారాలు అందిస్తుంది.

## ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ :

భారత-టిబెట్ల మధ్య 2000 కిలోమీటర్లకు పైగా ఉన్న సరిహద్దును కాపాడటం కోసం ఏర్పాటైంది. లఢఖ్‌లోనూ, అరుణా చల్ ప్రదేశ్‌లోనూ చైనాతో ఉన్న సరిహద్దును కాపాడటంలో వినియోగిస్తారు.

## అంతర్గత భద్రత- చట్టాలు :

### మిసా (ఎంఐఎస్ఏ)...

మెయిన్టెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ ఏక్ట్ 1973లో అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం.. అంతర్గత భద్రతకు ముప్పుగా భావించిన ఎవరినైనా, ఎంతకాలమైనా ముందస్తుగా అదుపులోకి తీసుకొనే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. దాంతోపాటు ముందస్తు అనుమతి లేకుండా సోదాలు, టెలిఫోన్ ట్యాపింగ్ లాంటివి చేసే అధికారాలు అధికార యంత్రాంగానికి కల్పించారు. ఈ చట్టం దుర్వినియోగమైందనే విమర్శను ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వచ్చింది. 1977లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రద్దు చేసింది.

### టాడా (టీఏడీఏ)..

ద టెర్రరిస్ట్ అండ్ డిస్రప్టివ్ యాక్టివిటీస్ (ప్రివెన్షన్) యాక్ట్. పంజాబ్‌లో తీవ్రవాదం తీవ్ర స్థాయికి చేరటంతో... 1985లో ఈ చట్టాన్ని అమలులోకి తెచ్చారు. ఇది కూడా దుర్వినియోగమైందన్న విమర్శలు వచ్చాయి. టాడా 1995లో రద్దయింది.

### పోటా (పీవోటీఏ)...

2002లో ప్రపంచవ్యాప్తంగా తీవ్రవాదుల దాడుల నేపథ్యంలో... భారత్‌లో ప్రివెన్షన్ ఆఫ్ టెర్రరిస్ట్ యాక్టివిటీస్ ఏక్ట్ (పోటా)ను అమలులోకి తెచ్చారు. 2004లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం దీన్ని రద్దు చేసింది.